క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మంగారి తిరునాళ్ల

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామి వారి కల్యాణం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం వందలాది మంది భక్తుల ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి కోలాటాలు, పాట కచేరి, స్వామి వారికి సోమవారం వసంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. 69 వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ తమ సాంప్రదాయాలను, సంస్కృతులను చాటి చెప్పారు. గ్రామంలో బంధుమిత్రులతో కోలాహలంగా సందడి నెలకొంది. ఒక పక్క సంక్రాంతి పండుగ, మరో పక్క స్వామి వారి కల్యాణ మహోత్సవాలు కావడంతో దుర్గి, పరిసర గ్రామాల నుంచి భక్తులు వందలాది మంది పాల్గొని రథోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకుని తోపులాటలు లేకుండా ఎస్ఐ టి వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు ఉత్సాహంగా బ్యాట్‌మెంటిన్, టెన్నీస్‌బాల్, క్రికెట్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

దాచేపల్లి : పేకాట ఆడుతున్న 6గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ అశోక్‌బాబు సోమవారం తెలిపారు. గురజాలలోని ఆర్అండ్‌బీ బంగ్లా వెనుక పేకాట ఆడుతున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని, 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెల్లడించారు.

రెండు ఆటోలు ఢీ : పలువురికి స్వల్ప గాయాలు

మాచవరం: మండలంలోని చెన్నాయపాలెం-వేమవరం గ్రామాల మధ్య రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తెలిపిన వివరాల మేరకు మండలంలోని మోర్జంపాడు గ్రామానికి చెందిన కొందరు తెలంగాణాలోని మట్టపల్లి నుంచి ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా, వేమవరం నుంచి రేగులగడ్డ వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్నాయి. ఘటనలో ఆటోల్లో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పోలీస్‌స్టేషన్లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

స్టేషన్‌కు హాజరైన టీడీపీనేత జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల: పల్నాడు జిల్లా మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, మరో 22 మంది వచ్చి కండీషన్ బెయిల్ కింద సంతకాలు పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుంటూరు నుంచి ప్రత్యేక బస్సులో మాచర్ల వచ్చిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు చేసి వెనుదిరిగారు. గత నెల 16వ తేదీన పట్టణంలో అల్లర్లకు కారణమైన టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి, మరో 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో హైకోర్టు రెండు వారాల కిందట కండిషన్ బెయిల్ మంజూరు చేయగా 2వ ఆదివారం వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో మాచర్ల, కారంపూడి సీఐలు టి.బాలకృష్ణ, దార్ల జయకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా శేఖర్

క్రోసూరు: వాసవీ క్లబ్ క్రోసూరు టౌన్ అధ్యక్షుడిగా గుగ్గిలం శేఖర్ ఏకగ్రీవంగా నియమితులైనట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తొమ్మండ్రు నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు శేఖర్‌కు ప్రెసిడెంట్ కాలర్ వేసి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు. శేఖర్‌ను పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: అన్నసంతర్పణ కోటి గోవుల దాన ఫలితంతో సమానమని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. సత్తెనపల్లి రూరల్ మండలంలోని అబ్బూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.మహాలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఆదరణ వృద్ధా ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ దానం తీసుకున్న వారిని పూర్తిగా సంతృప్తి పరిచేది అన్నసంతర్పణ మాత్రమేనన్నారు. అన్నసంతర్పణ ఒక యజ్ఞం లా భావించాలనీ, ప్రేమ అంకితభావంతో వడ్డించి అన్న సంతర్పణ చేయడం ద్వారా మీకు ఎదుటివారితో ఒక లోతైన బంధం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండే షన్ సభ్యులు రె.సురేష్, సోమశేఖర్, నిర్వాహకులు రిషిత ఉన్నారు.

వైభవంగా సంక్రాంతి వేడుకలు



పల్లకీపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ చెన్నకేశవస్వామి, భీమేశ్వరస్వామి గ్రామోత్సవం



శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి



దాచేపల్లి : సంక్రాంతి పండుగ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే పలు ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో స్వామివారిని పల్లకిపై ఊరేగించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమంను చేపట్టారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో బసవన్నలు సందడి చేశారు. ఇళ్ల లోగిళ్లలోకి బసవన్నలు రావడంతో కానుకలు సమర్పించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉద్యోగ, వ్యాపారిత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు రావడంతో గ్రామాల్లో సందడి నెలకొన్నది. సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, యార్డు చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, దాచేపల్లి సైదారావు, మునగా శ్రీనివాసరావు తదితరులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గురజాలలో...

సంక్రాంతి, కనుమ పండుగలను గురజాల మండలంలో కూడా ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో గంగిరెద్దులు సందడి చేశాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ పోలు వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర రావు, సిద్దాడపు గాంధీ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

విజయపురిసౌత్: సంక్రాంతి పండుగ సంబరాలను విజయపురిసౌత్‌లో ఆది, సోమవారాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. పిండివంటలు, గంగిరెద్దుల సందడి, చిన్నారుల గాలిపటాల కేరింతలు, ఇండ్ల ముంగిట రంగవల్లులతో నూతన ఉత్సాహంతో స్థానికులు పండుగను జరుపుకున్నారు. స్థానిక దేవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. శ్రీ సీతా రామాలయంలో అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైకుంఠపురంలో సంక్రాంతి సంబరాలు

కారెంపూడి: మండలంలోని గిరిజన గ్రామం వైకుంఠపురంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజులు సంప్రదాయబద్ధంగా పండుగను చక్కగా ఐకమత్యంగా జరుపుకున్నారు. మహిళలు వేసిన ముగ్గులు అలరించాయి. సంచార జీవులుగా బతుకుతున్న యానాదులమైన తమకు స్థిరనివాసం ఏర్పాటుచేసుకునేలా 1961లోగ్రామ స్థాపనకు కృషిచేసిన పెద్దలను ముగ్గుల రూపంలో స్మరించుకున్నారు. అలాగే ప్రభుత్వం తమ సంక్షేమానికి అభివృద్ధికి అందిస్తున్న పథకాలను ప్రతిబింబిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ముగ్గులు వేశారు. రైతులుగా జీవనం సాగిస్తున్న గిరిజనులంతా ఐకమత్యంగా సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు మంచి బహుమతులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య తదితరుల చేతుల మీదగా పంపిణీ చేశారు. పండుగలో ఎంపీటీసీ చేవూరి భవానిసుబ్బారావు, మాజీ ఎంపీటీసీ యాకసిరి లక్ష్మీతిరుపతిరావు, గ్రామ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఇళ్ల ముందు సంక్రాంతి ముగ్గులు కనువిందు చేయగా ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్లు, బంధు మిత్రులతో ప్రతి ఇంట సంతోషాలు వెల్లువెరిశాయి. భక్తులు వేకువ జామునుంచే రెంటచింతలలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిట్టగుడిపాడు గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు వడ్డమాను రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. రెంటాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేష భట్టాచార్యులు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెంటాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ చెన్నకేశవస్వామి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తుమ్మకోట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయ చైర్మన్ పోట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు చిట్టేల మల్లిఖార్జున శర్మ, స్వయంపాకుల సత్యనారాయణమూర్తి, ఎస్. సతీష్ శర్మ, నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి, జనార్ధనస్వామి, సీతారామస్వామి ఉత్సవ విగ్రహంలతో గ్రామోత్సవం నిర్వహించారు.

మాచర్ల రూరల్‌లో...

మాచర్ల రూరల్: మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలు గుర్తుంచుకునేలా కన్నుల పండుగగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఆనందదాయకమని రూరల్ సీఐ షేక్ షమీముల్లా అన్నారు. సోమవారం మండలంలోని గన్నవరం గ్రామంలో సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో వర్గాలకు, కులాలకతీతంగా పండుగను నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. ఇదే రీతిలో అన్ని గ్రామాల ప్రజలు ఐక్యతతో అన్నీ పండుగలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంక్రాంతి విశిష్టితను తెలిపే పందిళ్ళు, నాగళ్ళు, అరకలు, ఎద్దులు, చెరుకుగడలతో ఏర్పాటు చేసిన పొంగళ్ళను ఆయన తిలకించి నిర్వాహకులను అభినందించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజశేఖర్, సర్పంచ్ కందుల శివారెడ్డి, దొండేటి రామకృష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి తదితరులున్నారు.

పండుగలు ఐక్యతకు దోహదం: ఎంపీపీ బూడిద

సాంప్రదాయాలకు నెలవైన గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను ఐక్యతతో జరుపుకోవడం శాంతి, సమానత్వానికి దోహదపడుతుందని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో పిఆర్కే, పివిఆర్, బూడిద యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించడం, అందులో మహిళలు పాల్గొనడం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా విజేతలైన ఎం మధు శ్రీ, సంధ్య, జ్యోతి, వైష్ణవి, శిరిషలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎజిపి గొర్రె వెంకటేశ్వర్లు, యల్లాల బ్రహ్మయ్య, పసుపులేటి బ్రహ్మం, శ్రీనునాయక్, మహంకాళి శ్రీను, సంపత్ శేఖర్, కొండా కృష్ణ, పుట్టా బ్రహ్మంలు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా పోలా ఝాన్సీ, ఐవి నాగమణి, కొరటా అంజలిలు వ్యవహరించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మాచర్ల: పట్టణంలో సంక్రాంతి, కనుమ పండుగలు పురస్కరించుకుని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆది, సోమవారం ఘనంగా సంబరాల కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి రింగురోడ్డులోని వైభవ్ రెసిడెన్సీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డా రామకోటయ్య, పఠాన్ నాగూర్‌వలి, మస్తాన్, పెట్రోల్ బంకు ప్రసాద్ ఘనంగా రోటరీ క్లబ్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు సందర్భంగా సాంప్రదాయాలు కాపాడే విషయం పై మాట్లాడారు. అనంతరం విందు కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు, లయన్స్ క్లబ్ మాచర్ల, కృష్ణవేణి, న్యూటన్స్ కళాశాల, శ్రీహర్ష, కిడ్స్ పాఠశాల, ఫర్టిలైజర్స్ అసోసియేషన్‌తో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని వేంచేసియున్నా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, చెన్నకేశవ స్వామి దేవాలయంతో పాటు శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి, శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంతో పాటు అనేక దేవాలయాలలో సంక్రాంతి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. లోగిళ్ల ముందు వేసిన రకరకాల రంగవల్లులు బాగా ఆకట్టుకున్నాయి. హరిదాసులు దైవ కీర్తనలు ఆలపిస్తూ సందడి చేశారు. బంధు, మిత్రుల రాకతో గ్రామాలు కళకళలాడాయి. పలు గ్రామాల్లో భక్త బృందం సభ్యులు భజనలు చేస్తూ, భక్తి కీర్తనలు ఆలపిస్తూ పురవీధుల్లో దేవున్ని ఊరేగించారు.

ముగ్గుల పోటీలు.... మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన పలు రకాల ముగ్గుల బాగా ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గ్రామాన్ని స్థాపించిన పెద్దల పేర్లతో వేసిన ముగ్గు



ఇంటి ముందు వేసిన అందమైన రంగవల్లులు



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని తెలుపుతూ వేసిన ముగ్గు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రూరల్ సీఐ షేక్ షమీముల్లా, ఎస్ఐ రాజశేఖర్, సర్పంచ్ శివారెడ్డి

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

దాచేపల్లి : మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. వైఎస్సార్ సీపీ, టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతగా రామాపురం జట్టు నిలిచింది. రెండవ స్థానంలో వీరాపురం జట్టు, మూడవ స్థానంలో పిడుగురాళ్ల జట్టు నిలిచింది. మొదటి బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రెండవ బహుమతిగా రూ.7వేలు నగదు, షీల్డ్‌ను జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మూడవ బహుమతిగా రూ.3 వేలు నగదు, షీల్డ్‌ను ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి విజేతలకు అందజేశారు. విజేతలను టిక్నో పెయింట్స్ అధినేత శ్రీనివాసరెడ్డి అభినందించి క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు తొడ్పాటు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నన్నేబోయిన వెంకయ్య, మాజీ సర్పంచ్ కర్నాటి సైదారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, నాయకులు వేముల నాగిరెడ్డి, గురవారెడ్డి, వీర్ల పుల్లయ్య, రామయ్య, శ్రీను, పరిమి బాబు, కుంపటి చింతయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

క్రీడలతో మానసికోల్లాసం



మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

వెల్దుర్తి: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గ్రామస్తులు వెంకటేశ్వరరెడ్డిని సన్మానించారు. క్రిష్టియన్ యూత్ మాదాసు రాజ్‌కుమార్, నందిగం సునీల్, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. దేహదారుఢ్యానికి క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎస్ఐ శ్రీహరి మాట్లాడుతూ యువకులు ఐకమత్యంతో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషకరమన్నారు. యువకులు ముందుండి మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి సునీల్, భరత్‌లకు రూ. 6వేలు, ద్వితీయ బహుమతి భరత్‌రెడ్డి, సలీంలకు రూ. 4వేలు, తృతీయ బహుమతి ఆంజనేయులు, బ్రహ్మంలకు రూ. 2500, నాలుగో బహుమతి రాజబాబు, అజయ్ కుమార్‌లకు రూ. 1500లు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేకల కోటిరెడ్డి, మాదాసు ప్రభుదాసు, లూథర్, హనుమయ్య, నక్రా మల్లయ్య, సీతారామిరెడ్డి, రమణారెడ్డి, బుగ్గ మల్లయ్య తదితరులున్నారు.

హనుమంతునాయక్, వెంకటేశ్వరరెడ్డికి సన్మానం

మాచర్ల: నియోజక వర్గంలోని వెనుకబడిన ప్రాంతంలో వెల్దుర్తి మండలానికి చెందిన శ్రీరాంపురం తండ నివాసితులు రెండవ విడత ఎస్టీ సెల్ మైదాన ప్రాంత అధ్యక్షులుగా ఎంపిక కావటం, వెల్దుర్తి మండలంలోని ఉప్పలపాడు గ్రామ నివాసి తాడి వెంకటేశ్వరరెడ్డి మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులు కావడం పలువురు అభినందించారు. సోమవారం స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కుర్రి సాయి మార్కొండారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునాయక్, వెంకటేశ్వరరెడ్డిలను పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

స్వామియే శరణం అయ్యప్ప

అచ్చంపేట: మకర సంక్రాంతి సందర్భంగా శ్రీ అచ్చమ్మ పేరంటాలు అమ్మ మణికంఠ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం మకర జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా శివాలయం నుంచి అయ్యప్ప భక్తులు స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో ఊరేగింపుగా ఆంజనేయ స్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. తొమ్మిది రకాల పూజా ద్రవ్యాలతో అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు.

సమాజంలో గౌరవంగా బతకాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

దాచేపల్లి : సమాజంలో గౌరవం పొందేలా బతకాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పంచాయతీరాజ్ బంగ్లాలో ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలుపై ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మనతో ఉన్న ప్రతి ఒక్కరిని గౌరవించాలని, ప్రత్యర్థులను కూడా ఆప్యాయంగా పలకరించుకునే మనస్తత్వం కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ఎవరితో ద్వేషాలు, పగలు పెట్టుకోవద్దని, అందరిని కలుపుకుని పోయి నలుగురితో ఫలనా వ్యక్తి మంచి వాడు అని అనిపించుకోవాలని ఎమ్మెల్సీ డొక్కా అన్నారు. మనిషి వ్యక్తిగత అభివృద్ధితో పాటుగా సమాజ అభివృద్ధికి తొడ్పాటు అందించాలని, విద్వేషాలు విడిచి ప్రశాంతంగా జీవించాలని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు అన్యాయంకు గురైనప్పుడు ఈ చట్టాలను ఉపయోగించుకుని న్యాయం పొందాలని, ఈ చట్టాలను దుర్వినియోగం చేయవద్దని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని, ఏ చట్టం వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో ప్రతి ఎస్సీ, ఎస్టీ తెలుసుకోవాల్సిన అవపరం ఉందని ఎమ్మెల్సీ డొక్కా చెప్పారు. ఈ సమావేశంలో గురజాల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమితులైన కలకండ ఆంధ్రయ్య, న్యాయవాది కత్తి చలమరాజు, ఎస్సీ నాయకులు గాలి కాశయ్య, వినుకొండ అనిల్, వినుకొండ నవీన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



శ్రీనగర్‌లో కోలాటం ప్రదర్శిస్తున్న దృశ్యం

దాచేపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ ప్రత్యేకతలు, విశిష్టతలు ప్రతిబింబేలా మహిళలు వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలుత మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆర్షణగా నిలిచింది. అదే విధంగా కుర్చీ ఆట, తాడు ఆటలను మహిళలు నిర్వహించారు. విజేతలైన మహిళలకు టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, నాయకులు వణుకూరి రామకృష్ణారెడ్డి, రాంబాబు తదితరులు బహుమతులు అందజేశారు. మండలంలోని పెదగార్లపాడు, ముత్యాలంపాడు, తంగెడ, దాచేపల్లి, నడికుడి, రామాపురం, గామాలపాడు తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

స్వర్ణ కవచ, చందన అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని స్వర్ణకవచ అలంకరణ చేశారు. రైల్వే స్టేషన్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని ఆదివారం చందన అలంకరణ చేశారు. అలాగే గడియార స్తంభం సెంటర్‌లోని రామాలయం, తదితర ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యల హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరునాళ్ల

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముత్యాలమ్మ తిరునాళ్ళను శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ముత్యాలమ్మ తల్లికి పొంగళ్లు పొంగించి, భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకుని, చీరాసారెలు సమర్పించారు. గ్రామంలోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరుణాళ్ల సందర్భంగా ఆడపడుచులకు నూతన వస్త్రాలు, సారె చీరను పెట్టారు. గ్రామ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన తిరుణాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ఎస్‌కే. షఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

సత్తెనపల్లి: పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్ లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి గోదాదేవి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల ఆంజనేయ చార్యులు నేతృత్వంలో అర్చకుల బృందం వేదమంత్రోచరణ మధ్య కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వ హించారు. ఈ కల్యాణ మహోత్సవానికి మున్సిపల్ చైర్పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి, ఆమె భర్త సాంబశివరావు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణం తిలకించారు. కల్యాణానికి శాశ్వత శాశ్వత దాతగా దేవతి సుబ్బారావు (మెమంటో)వ్యవహరించారు. ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి, దేవతి సుబ్బారావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.